క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దారుగా శిరీష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ శివకృష్ణ, కార్యదర్శి, సిబ్బంది, శిరీషకు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీత్లా పండుగ అందరూ ఒకేరోజు జరుపుకోవాలి

టేకులపల్లి: బంజారాలు అతి పవిత్రంగా జరుపుకునే సీత్లా భవానీ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బంజారాలు వేర్వేరుగా కాకుండా ఒకేరోజు ఈనెల 8న జరుపుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు నూనావత్ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఉన్న లంబాడీ సోదరులంతా తమ ఊరిలో ఉన్న పాడిపంటలు, పశువులు బాగుండాలని గ్రామంలో ఆనందోత్సాహాలతో జరుపుకునేదే సీత్లా భవానీ పండుగ అన్నారు. జాతి ఐక్యతను చాటుకోవాలంటే వేర్వేరుగా కాకుండా అందరూ ఒకేరోజు జరుపుకుంటే బంధాలు, ఆత్మీయతలు, జాతి ఐక్యత పెరుగుతుందన్నారు.

ఏఐఎస్ఎఫ్ కార్యవర్గం ఎన్నిక

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాల్వంచలో జరిగిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నాలుగో సభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు స్థానిక శేషగిరిభవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు ఫహీం దాదా వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా షాహిద్, కార్యదర్శిగా వి.అజిత్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఎం.వినయ్, ఉపాధ్యక్షుడిగా నాగేంద్రబాబు, టి.వినయ్, పవన్ కల్యాణ్, సంజయ్, సహాయ కార్యదర్శులుగా గుండాల సృజన్, పవన్‌సాయి, గుగులోత్ వంశీ, బత్తుల సాయి, ఎస్.సాయికుమార్‌తో పాటు మరో 36 మంది కౌన్సిల్, 18 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు.

మందులు అందుబాటులో ఉంచండి..

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని, రెగ్యులర్ డాక్టర్లు, పర్మనెంట్ సూపరింటెండెంట్‌ను నియమించాలని ఐద్వా సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ఇల్లెందు మండల ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ఆస్పత్రిని సందర్శించి సదుపాయాలు, వైద్యం అందుతున్న తీరును సర్వే నిర్వహించారు. ఆలేటి సంధ్య మాట్లాడుతూ.. 500 వరకు ఓపీ వస్తోందని, 16 మంది డాక్టర్లు ఉన్నా అందుబాటులో 8 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. అంబులెన్స్ లేదు, 12 గంటల వరకు ఓపీ చూసి డాక్టర్లు వెళ్లిపోతున్నారని, 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం డీఈఓ ఎం.వెంకటేశ్వరచారికి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కార్యదర్శి జె.గణేష్ మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం యంత్రాంగం అశ్రద్ధ చేస్తోందన్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆడుకోవడానికి ఆట వస్తువులు లేక శారీరకంగా, మానసికంగా ఎదగలేక పోతున్నారని పేర్కొన్నారు.

బిల్ కలెక్టర్ మృతి

కొత్తగూడెంఅర్బన్: గొల్లగూడెం ఏరియాలో నివాసముంటున్న కొత్తగూడెం కార్పొరేషన్‌లో పని చేసే బిల్ కలెక్టర్ ఎల్లయ్య(60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఇల్లెందు మున్సిపాలిటీ నుంచి 8 నెలల క్రితం బదిలీపై కొత్తగూడెం వచ్చిన ఆయన పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నారు. మృతుడి భార్య, కొడుకు ఉన్నారు.

కొట్టుకుపోయిన పైపులైన్లు

- ముందస్తు ప్రణాళికలో అధికారుల వైఫల్యం
- తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు
- అనాలోచిత నిర్మాణాలతో ప్రజాధనం వృథా



వరదకు కొట్టుకుపోయిన తాగునీటి పైపులైన్



వృథా అవుతున్న కిన్నెరసాని నీరు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 29 డివిజన్లకు ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇంట్లో అవసరాలకు వాడుకునేందుకు కూడా నీరు లేకపోవడంతో మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగూడెంలోని 29 డివిజన్లకు వచ్చే కిన్నెరసాని నీటి సరఫరా ప్రధాన పైపులైన్‌ను లక్ష్మీదేవిపల్లి నుంచి ముర్రేడు వాగు గుండా నగరంలోకి మూడు నెలల క్రితం రూ.5లక్షలతో నూతన పైపులైన్‌ను కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ముందస్తు ఆలోచన లేకుండా రూ.లక్షలు ఖర్చు చేసి ముర్రేడు వాగులో భూమిలో పైపులు ఏర్పాటు చేసి నగరానికి కనెక్షన్ ఇచ్చారు. ప్రస్తుతం మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాగులో ఎటువంటి రక్షణ లేకుండా ఏర్పాటు చేసిన పైపులైన్లు వరదకు కొట్టుకుపోయాయి. గురువారం మున్సిపల్ అధికారులు.. సిబ్బంది చేత పనులు చేయిస్తున్నారు. అయితే చిన్నపాటి వరదకే పైపులైన్లు కొట్టుకుపోతే రానున్న రోజుల్లో మరింత భారీ వర్షాలు పడితే సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితులు రాకుండా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని శాశ్వతంగా పైపులైన్లు ఉండే విధంగా నిర్మాణాలు చేయాలని స్థానికులు వాపోతున్నారు.

అనాలోచిత నిర్మాణాలు...

వర్షాకాలం అయినప్పటికీ నగరంలోని ప్రజల ఇళ్లలో వాడుకునేందుకు నీరు లేకపోవడం వలన అవస్థలు పడుతున్నారు. అధికారులు ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన వాగు గుండా వేసిన పైపులైన్లు కొట్టుకుపోయాయి. దీనివలన నీటి సరఫరా నిలిచిపోయింది. అదేవిధంగా నగరంలో కూడా అనేక నిర్మాణాలు అనాలోచితంగా చేయడంతో కార్పొరేషన్‌లో వృథాగా కనిపిస్తున్నాయి. దీని వలన ప్రజాధనం వృథా అవుతుంది తప్ప, ప్రయోజనం కలగడం లేదు.

నగరంలో రైతుబజార్ పక్కనే రూ.లక్షల ఖర్చు చేసి వీధి వ్యాపారుల ప్రాంగణం నిర్మించి నాలుగేళ్లు గడుస్తోంది. కానీ ప్రస్తుతం అది యాచకులకు, పశువులకు నివాసంగా మారింది. దీంతో పాటు రైతు బజార్ ఎదురుగా మున్సిపల్ మార్కెట్ నిర్మాణం చేశారు. దీనికి పార్కింగ్ స్థలం లేకపోవడం వలన వినియోగదారులు లోపలికి వెళ్లి కూరగాయలు కొనడం లేదు. దీని వలన వ్యాపారస్తులు కూడా అందులో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఇష్టపడడం లేదు. రోడ్లపై తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు కలుగజేస్తున్నారు. ఇదిలా ఉంటే గొల్లగూడెం వెళ్లే మార్గంలో కిరోసిన్ బంక్ ఎదురుగా వ్యాపారస్తుల కోసం కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. రెండు సంవత్సరాల క్రితం వాటికి కూడా మరమ్మతులు కూడా చేయించారు. అందులో కూడా వ్యాపారస్తులు వ్యాపారం చేయడానికి ముఖం చాటేస్తున్నారు. దీంతో వ్యాపార కాంప్లెక్స్‌లు రూ.లక్షలు ఖర్చుతో నిర్మాణం చేసి వదిలేయడం వలన నిరుపయోగంగా మారుతున్నాయి. ఇందంతా కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులకు భవిష్యత్ ప్రణాళికపై అవగాహన లేకపోవడం వలనే జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

శాశ్వత పరిష్కారానికి ఏర్పాట్లు..

ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి వచ్చిన వరదతో కిన్నెరసాని పైపులైన్ ముర్రేడు వాగులో దెబ్బతిన్నాయి. యుద్ధప్రతిపాదికన పనులు నిర్వహించి పైపులైన్లకు మళ్లీ కనెక్షన్లు ఇచ్చి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాం. శాశ్వత పరిష్కార దిశగా ఏర్పాట్లు చేస్తాం.

– రవికుమార్, కార్పొరేషన్ డీఈ

పాల్వంచలో వనరులు పుష్కలం



మాట్లాడుతున్న నాయకులు

పాల్వంచ: పాల్వంచలో మరో విద్యుత్ కేంద్రం ఏర్పాటు వనరులు పుష్కలంగా ఉన్నాయని కేటీపీఎస్ 8వ దశ సాధన సమితి చైర్మన్ జమ్ముల సీతారామిరెడ్డి, కన్వీనర్ బి.మంగీలాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరో 2,800 మెగావాట్ల పవర్ ప్లాంట్ తక్కువ ఖర్చులో పూర్తవుతుందని, ఇక్కడ ప్లాంట్ నిర్మాణానికి సరిపడా భూమి, నీటి సౌకర్యం, సరిపోయేంత యాష్ పాండ్, స్విచ్ యార్డ్, రిజర్వాయర్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, బొగ్గు, రైల్వే లైన్, రవాణా సౌకర్యం పూర్తిస్థాయిలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎం.మాజీద్, ఎండీ.సమీర్ అహ్మద్, గిరిధర్, సుధాకర్, రాంబాబు, రామారావు, వేణుగోపాల్, రామకృష్ణ జాదవ్, కేశబోయిన కోటేశ్వరరావు, సాధం రామకృష్ణ, పుల్లారావు, రాంబాబు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య జయంతి



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న నేతలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం శాలేంరాజు ఆధ్వర్యంలో వివిధ శాఖాధిపతులు శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాల్వంచ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఆశయాలు సాధించాలని కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం కేటీపీఎస్ కర్మాగారంలో రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈలు జీవీ.ధర్మారావు, పి.కృష్ణ, డిప్యూటీ సీసీఏ పి.రామారావు, ఎస్పీఎఫ్ ఆర్ఐ డి.కిరణ్, వెల్ఫేర్ ఆఫీసర్ భాగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ కార్యాలయంలో మేనేజర్ ఎల్వి.సత్యనారాయణ, ఆర్ఓ వెంకట లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందు: ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ సీఎం కే.రోశయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఇల్లెందులో 18వ వార్డు శ్రీ కన్యకాపరమేశ్వరీ సత్రంలో మాజీ సీఎం రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్వపల్లి రాధాకృష్ణమూర్తి, ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, ఝెలుగూరి నగేష్ కుమార్, అనుబాబు, రాజశేఖర్, మధుబాబు, రవికిరణ్, సతీష్ కుమార్, నాగరాజు, ఉపేంద్రనాథ్ పాల్గొన్నారు.

'అల్లూరి'ని స్ఫూర్తిగా తీసుకోవాలి



పాల్వంచరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: గాజులరాజం బస్తీలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారులు శ్రావణబోయిన నర్సయ్యతో పాటు పలువురు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. శ్రీనివాస్, డాక్టర్ రామ్మూర్తి, కాకెల్లి సైమన్, కూచన కృష్ణారావు, అనిల్, శ్యాం, శిల్ప, సృజన, నవీన తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అల్లూరి సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... మన్యం వీరుడు స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులతో పోరాడి తన ప్రాణాలను అర్పించాడని కొనియాడారు. కార్యక్రమంలో రాపాక రమేష్, చింతల చెరువు శ్రీనివాసరావు, భూక్యా రవినాయక్, కల్లోజు నాగరాజు, సందీప్, తాటికొండ కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు సేకరించిన విద్యార్థులు



జూలూరుపాడు హైస్కూల్‌లో సేకరించిన విత్తనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లో పర్యావరణం - పచ్చదనం, చెట్ల ప్రాముఖ్యత పట్ల అవగాహన పెంచే క్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వినూత్నంగా విత్తనాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కొత్తగూడెం మండలంలో రామవరం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం, కూలీలైన్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూలీలైన్ ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంఈఓ ప్రభుదయాళ్ తెలిపారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం ప్రథమ స్థానం, కూలీలైన్ పాఠశాల ద్వితీయ స్థానంలో ఉన్నాయని, కాంప్లెక్స్ స్థాయి విజేతలకు రూ.1000, మండల స్థాయి విజేతలకు రూ.5000 ప్రోత్సాహకంగా కలెక్టర్ ప్రకటించారని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించే వారికి రూ.50 వేలు ప్రోత్సాహకంగా కలెక్టర్ ఇవ్వనున్నారని తెలిపారు.

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం కాంప్లెక్స్ స్థాయిలోని విద్యార్థులచే పండ్ల మొక్కలు, నీడనిచ్చే చెట్లు, ఆకుకూరలు, కాయగూరలు, వాణిజ్య పంటలు, చిరుధాన్యాలకు సంబంధించిన విత్తనాలను సేకరించారు. కాంప్లెక్స్ స్థాయిలో జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విత్తనాల సేకరణలో విజేతగా నిలిచింది. కార్యక్రమంలో పాపకొల్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్, కాకర్ల హైస్కూల్ హెచ్‌ఎం పి.సంజీవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి స్పందించాలి

జూలూరుపాడు: రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు అన్నారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ.. యూరియా కొరతను వ్యాపారులు అవకాశంగా తీసుకుంటున్నారని, వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సెంట్రల్ యూనివర్సిటీలో సీటుపై అభినందన

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ ఉత్తీర్ణుడైన మండలంలోని అమర్‌సింగ్‌తండా గ్రామానికి చెందిన జర్పుల వినయ్ తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ సీటు సాధించాడు. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఫిజిక్స్ విభాగం నుంచి 465వ ర్యాంకు సాధించాడు. కాగా, వినయ్‌ను శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య, అధ్యాపకులు అభినందించారు.

హైదరాబాద్ తరలిన కాంగ్రెస్ నేతలు



ఇల్లెందు: హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

ఇల్లెందు: కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన చలో ఎల్‌బీ స్టేడియం కార్యక్రమంలో భాగంగా ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఆ పార్టీ నేతలు తరలి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇల్లెందులోని జేకే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బస్‌ల ద్వారా 300 మంది గ్రామ శాఖల అధ్యక్షులు, ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డానియేల్, పులి సైదులు, బానోతు రాబాబు తదితరులు తరలి వెళ్లారు.

సుజాతనగర్: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన గ్రామ కమిటీ అధ్యక్షులు, క్రియాశీల కార్యకర్తల సమావేశానికి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. వెళ్లిన వారిలో చింతలపూడి రాజశేఖర్, మండె వీరహనుమంతరావు, లోశెట్టి నాగార్జున్, చిమట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: శుక్రవారం హాజరైన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన సభకు జూలూరుపాడు మండలానికి చెందిన కాంగ్రెస్ గ్రామస్థాయి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి అధ్యక్షులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సులో హైదరాబాద్ వెళ్లారు. వెళ్లిన వారిలో మాలోత్ మంగీలాల్ నాయక్, లకావత్ లచ్చునాయక్, గోపు రామకృష్ణ, బానోత్ బాబు, వాంకుడోత్ కిషన్, కొలిపాక శ్రీనివాసరవు, కొర్సా రమేష్, ఉసికల వెంకటేశ్వర్లు, మల్కం వీరభద్రం, హళావత్ రఘు, రాచబంటి వెంకటనర్సయ్య, తోట శ్రీను, కొమ్మిన్ని రాంబాబు, మెంతుల కృష్ణ, బాలాజీ, సామ్యా, బానోత్ కిషన్, లకావత్ రమేష్ ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

జూలూరుపాడు: కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఎత్తివేయాలని సీఐటీయూ ఏజే రమేష్ కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. శుక్రవారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో జరిగిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంస్కరణల పేరుతో కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. చికాగో అమరవీరుల సాక్షిగా 8 గంటల పని విధానాన్ని సాధించుకుంటే బీజేపీ 12 గంటల పని విధానాన్ని కార్మికులపై రుద్దాలని చూస్తోందన్నారు. అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ అసంఘటిత కార్మికులను వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పూనెం ఝాన్సీ, భూక్యా వీర్యా, సీతామహాలక్ష్మి, నీలిమ, మణి, యాసా నరేష్, గార్లపాటి వెంకటి, బొల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వద్ద రైతుల పడిగాపులు

యూరియా కొనుగోలుకు ఆరాటం..

- నేటికీ ప్రైవేట్ వ్యాపారుల దరిచేరని నరుకు
- కొరత ప్రచారంతో రైతుల్లో ఆందోళన



పీఏసీఎస్ గోదాములో నిల్వ ఉన్న యూరియా



కొనుగోలు కోసం బారులు తీరిన రైతులు

ఇల్లెందురూరల్: వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో యూరియా విక్రయాలు జోరందుకున్నాయి. జిల్లాకు అవసరమైన మేరకు యూరియా చేరిందని, మండల కేంద్రాల్లోనూ నిల్వలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం విక్రయాలు పీఏసీఎస్‌లకే పరిమితమయ్యాయి. ప్రైవేట్ వ్యాపారులు అనుబంధ ఉత్పత్తుల విక్రయ భారాన్ని మోయలేక యూరియా దిగుమతికి ఆసక్తి చూపడం లేదు. స్థానికంగా దుకాణాల్లో యూరియా లభించకపోవడంతో కొరత ఉందన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు రైతులు. దీంతో యూరియా విక్రయ కేంద్రం వద్ద రైతులు బారులు తీరుతున్నారు.

విక్రయాలకు ఆసక్తి చూపని వ్యాపారులు..

సీజన్ ప్రారంభమై.. వర్షాలు కురవడంతో సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిలో ప్రైవేటు వ్యాపారుల వద్దకు యూరియా నిల్వలు చేరకపోవడం రైతుల్లో ఆందోళన నెలకొంది. యూరియాతోపాటు నానో, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాలని కంపెనీల నుంచి ఒత్తిడి వస్తుందన్న ముందస్తు సమాచారంతో వ్యాపారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఆ ఒప్పందాన్ని అంగీకరించి కొనుగోలు చేసినా యూరియా విక్రయం వల్ల కలిగే లాభం కంటే అదనపు ఉత్పత్తుల విక్రయం మరింత నష్టాన్ని తెచ్చిపెతుందన్న భావన వ్యాపారుల్లో నెలకొంది. ఈ కారణంతో ప్రైవేటు వ్యాపారులు యూరియా విక్రయాలపై ఆసక్తి చూపడం లేదన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. ఈనెల పదో తేదీన విక్రయాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

కొనుగోళ్లపైనే దృష్టి...

ఏజెన్సీ ఏరియాలో తరతరాలుగా వ్యాపారుల పెట్టుబడి ద్వారా రైతులు సేద్యం చేస్తున్నారు. విత్తనం మొదలు విక్రయం వరకు అన్నీ రైతు ఎంపిక చేసుకున్న వ్యాపారి వద్దే జరుగుతుంటాయి. వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా ప్రభుత్వం రైతు భరోసా అమలు చేస్తున్నా రైతులు మాత్రం ప్రైవేటు వ్యాపారి వద్దకు పెట్టుబడికి వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుత సీజన్‌లోనూ రైతులు పెట్టుబడికి వ్యాపారులను ఆశ్రయిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో ప్రధాన పంటలైన పత్తి, మొక్కజొన్న విత్తు, మొలక దశలో ఉన్నాయి. నీటి వనరులు సమృద్ధిగా ఉన్నచోట మొక్క దశకు చేరుకున్నాయి. కానీ ప్రస్తుత సీజన్‌లో యూరియా కొరత ఉందన్న ప్రచారంతో, పెట్టుబడి పెట్టే వ్యాపారుల వద్ద యూరియా నిల్వలు లేకపోవడంలో ఆందోళన చెందుతున్న రైతులు ముందుస్తుగా కొనుగోలుకు పరుగులు పెడుతున్నారు. వ్యాపారి పెట్టుబడి సాయంతో పీఏసీఎస్‌ల వద్ద అవరమైన మేర యూరియా కొనుగోలు చేస్తూ ఇళ్లల్లో నిల్వ చేసుకుంటున్నారు.

తప్పని ఆర్థిక భారం.. నీటి వనరులు ఉన్న రైతులు ముందే సాగు ప్రారంభించి ప్రస్తుతం యూరియా కొనుగోళ్లపై దృష్టి సారించారు. ప్రస్తుత వానాకాలంలో మండల వ్యాప్తంగా సుమారుగా 30వేల ఎకరాల్లో మొక్కజొన్న, 13వేల ఎకరాల్లో పత్తి సాగు ప్రారంభమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆయా పంటలకు అవసరమైన యూరియా కొనుగోలుకు రైతులు పరుగులు తీస్తున్నారు. ప్రాథమిక సహకార సంఘాల్లో మాత్రమే విక్రయాలు పరిమితం కావడంతో రైతులు మారుమూల గ్రామాల నుంచి అత్యధికంగా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇల్లెందు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాముల వద్దకు వచ్చి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. దీనికోసం వారు రోజంతా సమయం కేటాయించక తప్పడం లేదు. అంతే కాకుండా ఒక రైతుకు రోజుకు కేవలం నాలుగు బస్తాలు మాత్రమే ఇస్తుడటంతో మళ్లీమళ్లీ యూరియా కోసం విక్రయ కేంద్రం చుట్టూ తిరగాల్సి రావడం రైతులకు సమయం వృథా కావడంతోపాటు ఆర్థిక భారంగా మారుతోంది.

విక్రయ కేంద్రాలు పెంచాలి...



ఇల్లెందులో మాత్రమే యూరియా విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ రోజుకు నాలుగు బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. రైతులు పలుమార్లు తిరగకుండా విక్రయ కేంద్రాలను పెంచి రైతులకు సమయం, ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు కృషి చేయాలి.

– వాంకుడోత్ బాలు, రైతు, కొమరారం

యూరియా కొరత లేదు...



యూరియా నిల్వలు అన్ని మండలాల్లో అవసరమైన మేరకు ఉన్నాయి. డిమాండ్ మేరకు ప్రతీరోజు సరఫరా చేస్తున్నాం. ఇల్లెందులో రైతులు ఇబ్బంది పడకుండా కొమరారం, చల్లసముదరం కేంద్రంగా అదనపు విక్రయ కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

– బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి


నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే.సారయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీ వద్ద జరిగిన జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జేఏసీ నాయకులు చిలకరాజయ్య, విజయగిరి శ్రీనివాస్, గడప రాజయ్య, గట్టయ్య, మధుకృష్ణ, సందెబోయిన శ్రీనివాస్, హుమాయిన్, కత్తెర్ల రాములు, ఎస్.నాగేశ్వరరావు, సాంబమూర్తి, సురేందర్ పాల్గొన్నారు.


సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వరంగ సంస్థలు, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల పిలుపు మేరకు శుక్రవారం కొత్తగూడెంలోని ప్రధాన సెంటర్ల మీదుగా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు జలీల్, ఐఎఫ్‌టీయూ, టీయూఎల్ నాయకులు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వంగా వెంకట్, ఎస్ రమణమూర్తి, గెద్దాడి నగేష్, బండారు మల్లయ్య, భూక్యా శ్రీనివాస్, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

ఇల్లెందు: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అఖిలపక్ష జేఏసీ నేతలు కోరారు. శుక్రవారం ఇల్లెందులో అఖిలపక్ష జేఏసీ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ నబీ, నజీర్ అహ్మద్, సారంగపాణి, యాకుబ్‌షావలీ, రామ్‌సింగ్, రాజారాం, బంధం నాగయ్య, బాస శ్రీనివాస్, ఉడుత ఐలయ్య, రాసుద్దీన్ పాల్గొన్నారు.

టేకులపల్లి: 9న కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం టేకులపల్లిలో జరిగిన కార్మిక సంఘాల జేఏసీ సమావేశంలో ఇఫ్టూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ నాయకులు డి.ప్రసాద్, వీరన్న, రామచందర్, మదార్ పాల్గొన్నారు.



సూపర్‌బజార్(కొత్తగూడెం): మోటారు సైకిల్ ర్యాలీ



ఇల్లెందు: మాట్లాడుతున్న అఖిలపక్ష కార్మిక, రాజకీయ పక్షాల నేతలు